బదిలీ

బదిలీ అయింది.

దాదాపు ఏడుపుతో యింటికి చేరాడు రామచంద్రుడు. కుర్చీలో కూలబడి పోయాడు. విషయం విన్న జానకి పై ప్రాణాలు పైనే పోయాయి.

ఆ రోజు లగాయితూ వాళ్ళ యింటికి బంధువులూ, స్నేహితులూ తీర్థ ప్రజలా వస్తున్నారు, పోతున్నారు.

"ఎక్కడికీ? కొచ్చినే!

యింకేముందర్రా! అంతా అయిపోయినట్టే! దేశంగాని దేశం! భాష గాని భాష ఆ తిళ్ళూ మీరు తినలేరు. అ మనుషుల్తో మీరు తూగలేరు!

మీకెంతటి కష్టం వచ్చిందర్రా?-"

ఈ ధోరణిలో అడిగినవాళ్ళూ అడగనివాళ్ళూ వచ్చి ఊదరగొట్టేస్తున్నారు.

జానకి గుడ్లప్పగించి వింటోంది! గుడ్ల నీళ్ళు కుక్కుకుంటోంది! టీలు కాస్తోంది! వచ్చిన వాళ్ళకి పోస్తోంది!

"మీ ఆయన్ని మా యింటికి పంపించవే! మా వియ్యంకుడి పెత్తాత మనవడొహతను కొచ్చిన్లో ఉన్నాడుట. అడ్రసు యిచ్చాడు. వెతికి యిస్తాను. ఆ మనిషికి ఉత్తరం రాస్తే నా బంధో అంటూ సాయమవుతాడు-" అన్నాడు జానకి మేనమామ.

రామచంద్రుడు కేంద్ర ప్రభుత్వోద్యోగి. ట్రేసర్. మూడో తరగతిలో దిగువ స్థాయి వాళ్ళకు సాధారణంగా బదిలీలు ఉండవు. ప్రధాన కార్యాలయంలో ఓ గురుద్యోగికి ఓ చిరుద్యోగి కంటిలో నలక అయాడు. ఆ చిరుద్యోగి తిక్క కుదరాలంటే, అతన్ని కదిలించాలని భావించాడు. ఆ కదలికను ధర్మబద్ధం చేయటానికి వరసవారీ బదిలీలు దేశప్రగతికి అత్యవసరం అన్నాడు. సంబంధిత మంత్రిత్వ శాఖలన్నీ అవును సుమా అన్నాయి. ఆ విధంగా రామచంద్రుడిని విసిరేసారు.

అతను తన ఆఫీసరు దగ్గరకుపోయి - "అయ్యా! మీరు చెప్పిన గీతలెల్లా గీసాను. రాతలెల్లా రాసాను. నోరెత్తి మాట్లాడనివాడిని. పన్నెత్తి పలకరించటం రానివాడిని. వంచిన బుర్ర ఎత్తనివాడిని. వినయమే భూషణంగా గలవాడిని. నన్నిటుల సేయతగునా?" అన్నాడు.

"నిజమే నాయనా! మీ బోంట్ల వినయం మాకు ఉపాహారమే! అయితే మనమంతా పైవారికి కీలుబొమ్మలం! రికమెండింగ్ అథారిటీలు వేరు! అడ్మినిస్ట్రేటింగ్ అథారిటీలు వేరు! మళ్లీ నువ్వు వృద్దుడివయాక యీ విశాఖ వయిపు వద్దువుగానిలే! యీలోగా ఏ అథారటీకయినా నీ ఏడుపు వినపడిందా - సరే! నీ అదృష్టం పలుకుతుంది!-"

ఈ ధోరణిలో ఆయన తన నిస్సహాయత వెల్లడించాడు.

కొచ్చిన్ ఆఫీసు చాలా చిన్నది. ఆ ఆఫీసులో ఉద్యోగులు ఎవరూ రామచంద్రుడికి గాని అతని సహోద్యోగులకిగాని తెలియరు.

"ముందుగా వెళ్ళి అక్కడ జాయినవు! సెలవు పెట్టిరా! ఈలోగా యిల్లూ. పిల్లల స్కూలు సీట్లూ సెటిల్ చేసుకురా! తర్వాత వచ్చి సంసారాన్ని మోసుకుపో!-" అన్నారు మిత్రులు.

రామచంద్రుడు ఆ సలహా పట్టుకుని యింటికి చేరాడు.

భార్య తన మేనమామ చెప్పిన కబురు చెవిని వేసింది. మర్నాడు పొద్దుటే ఆ పెద్దమనిషి యింటికి పరుగెత్తాడు.

"చూసావు రామచంద్రం! నువ్వెత్తి తిక్కముండావాడివి! నీ పెళ్ళిలో నువ్వు చేసిన యాగీ ఉంది చూసావూ - అది నే మరిచిపోలేను" అంటూ ఎత్తి పొడిచాడు.

రామచంద్రుడు ప్రతిదీ ఇన్‌టోటో ఒప్పేసుకున్నాడు. దేన్నీ డినై చేయలేదు.

"కానీ - నీ పెళ్ళాం బహుదొడ్డది! ఆ పిల్ల మొహం చూసి నీకే సాయం చేస్తున్నాను! రాఘవరావని - మనవాడు! అంటే మన కులం! మన భాష! మనదేశం! చూడూ- మనం పైవాళ్ళతో వ్యవహరించేటపుడు - ఎంత కాదనుకున్నా - యివ్వేనయ్యా నిన్ను పైకి లాగేవీ -! మా వియ్యంకుడికి రాస్తే ఆయన తనూ ఉత్తరం రాస్తున్నానని రాసాడు! యిదిగో! అతని అడ్రస్ కూడా రాసాడు! నేనూ ఓ ఉత్తరం రాసాను! నువ్వు నీకేసాయం కావాలో రాయి! అన్నాడు- స్తోత్రాలకు పొంగే ఉబ్బులింగడిలా!"

ఆపళంగా రామచంద్రుడు యింటికి పోయి ఓ పూటంతా కష్టపడి ఓ ఉత్తరం తయారు చేసాడు.

ముందస్తుగా ఆ రాఘవరావూ తానూ ఏ రకమయిన బంధువులవుతారో లెక్కలు మొదలుపెట్టాడు. దాన్లో జానకీ సహకరించింది. ఆ విధంగా సంబోధిస్తూ

ఉత్తరం మొదలించాడు. ఆ తర్వాత తామెంత 'క్లోజో' ఎస్టాబ్లిష్ చేసాడు. 'నీవే తప్ప యింతఃవరం బెరుగ' అన్న ధోరణిలో చనువు ప్రదర్శించాడు.

"నా సమస్యలు మూడు (1) యిల్లు (2) పిల్లల చదువులు (3) స్టేషన్‌లో నన్ను రిసీవ్ చేసుకోటం- మీకు వీలయితే స్టేషన్‌కి రాగలరు. నన్ను గుర్తుపట్టటానికి వీలుగా నా ఫోటో ఒకటి జతపరుస్తున్నాను" అంటూ ముగించాడు.

రామచంద్రుడు తిరుగు జవాబుకోసం ఎదురుచూడటం మొదలుపెట్టాడు.

దానికి జవాబు వచ్చింది.

"మీకు యిల్లు కుదిరింది. స్టేషనుకు రాగలను. మూడు వేలు కనీసం యింటికి అడ్వాన్సు తెచ్చుకోవాలి."

రామచంద్రుడు కనిపించినవాళ్ళందరితోనూ చెప్పసాగాడు.

"చూసారాండీ! మనం మనమే! మనవాళ్ళు మనవాళ్ళే! మన భాష - మనదేనండి మాస్టారూ! మనలో మనకి ఎన్ని ఉన్నా - పైచోటికి వెళ్ళే మనవాళ్ళంతా ఒక్కటేనండి! అయినా అందులో తప్పేముందండి! ఉండాలండి! ఆ మాత్రం కట్టు ఉండాల్లెండి!...."

☆ ☆ ☆

ఉదయం పది గంటల ప్రాంతంలో కొచ్చిన్లో దిగాడు రామచంద్రుడు.

రాఘవరావు సులువుగానే రామచంద్రుణ్ణి గుర్తుపట్టాడు.

అతన్ని ఓ హోటల్లో దింపాడు రాఘవరావు. టిఫిన్లూ స్నానమూ పూర్తయాక యిద్దరూ బయల్దేరారు.

"మీ యింటి ఓనర్! ఉన్నికృష్ణన్!"

ఉన్నికృష్ణన్ పొట్టిగా బందోబస్తుగా ఉన్నాడు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అతను మాజీ సైనికుడు.

"తుపాకుల గురించి కబుర్లు చెబుతాడు! కంగారు పడకండి! వంటవాడిగా పని చేసాడు. మేకలు కోసుకు బతికాడు. చూసారు కదా! అలాంటాడు యింత యిల్లు కట్టాడు! దీన్నిబట్టే వీణ్ణి అంచనా వేయొచ్చు" అన్నాడు తెలుగులో రాఘవరావు.

ఉన్ని ఏదో అన్నాడు. రాఘవరావు మలయాళంలో జవాబిచ్చాడు. దాంతో రామచంద్రుణ్ణి చూసి బిగ్గరగా నవ్వటం మొదలుపెట్టాడు. మనిషిని చూసే సగమయిపోయాడు రామచంద్రుడు. రాఘవరావు మాటల్తో నోరు పాడారిపోతే ఉన్ని నవ్వుతో కరచరణాలు ఆడటం మానేసాయి.

ఉన్నికి ముక్కల యింగ్లీషు మాత్రమే వచ్చు.

నలభై ఏళ్ళుబట్టి తెలుగు నేలలో పెరిగి తెలుగు గాలి పీల్చి తెలుగు తిండి తింటూన్న రామచంద్రుడికీ యింగ్లీషు అంతంతమాత్రమే వచ్చు.

వాళ్ళిద్దరూ మలయాళంలో మాట్లాడేస్తూ ఉంటే రామచంద్రుడు నోరప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

ఇంతలో ఓ అమ్మాయి కాఫీల ట్రే తో వచ్చింది.

"టేక్....టేక్..." అన్నాడు ఉన్ని.

ట్రేలో కప్పు తీసుకుంటూ - 'నామ్ కహాఁ?" అన్నాడు రామచంద్రుడు. టీ అందిస్తూన్న పాపకి గాని, ఉన్నికృష్ణన్‌కి గాని ఏమీ అర్థం కాలేదు.

రామచంద్రుడు సిగ్గుపడుతూ - "నేమ్....షీ.... వాట్?"

ఉన్ని బిగ్గరగా నవ్వి -" డాటర్.... డాటర్...మీనూ" అంటే, "షీ గుడ్....అచ్చా...బహుత్ నైస్...." అన్నాడు రామచంద్రుడు.

ఇంటి యజమానిని సంతృప్తిపరచటమే సుఖజీవితానికి ప్రథమ సోపానమనీ - అది టెనెంట్ తాలూకు పవిత్ర కర్తవ్యమనీ - విశాఖపట్నంలో పదిహేడేళ్ళ అద్దెకొంపల అనుభవంలో అతను నేర్చాడు.

"సీ... హవుస్" అంటూ తీసుకెళ్ళాడు ఉన్నికృష్ణన్.

వెనకాలనడుస్తూ -"మీరేం మాటాడకండి! మీకు తెలీదు! అమ్మో! యీ మలయాళీలు మాయల మరాటీలు-" అన్నాడు రాఘవరావు.

బుద్ధిగా బుర్ర ఊపాడు రామచంద్రుడు. యిల్లు చిన్నది. వసతులన్నీ ఉన్నాయి. ప్రస్తుతం ఖాళీగా లేదు.

"వెన్ వేకెంట్?"

"మ్ మీరు మాటాడొద్దన్నానా?" రాఘవరావు గసిరాడు నవ్వుతూ.

"వెన్ యూ కమ్?" అన్నాడు ఉన్ని.

యిల్లు కుదిరిందని రాఘవరావు రాయగానే రామచంద్రుడు రిజర్వేషన్ కుటుంబానికంతటికీ చేయించేసాడు. ఆడేటూ ట్రైనూ చెప్పాడు.

"మీరు స్టేషనుకు వస్తారు గదా?" అన్నాడు రామచంద్రుడు.

"భలేవారే! ఎందుకు రానూ?" నవ్వుతూ అన్నాడు రాఘవరావు.

ఆ తర్వాత మరికొంతసేపు అతనూ ఉన్నీ మలయాళంలో ఏదో అనుకున్నారు. రాఘవరావు రామచంద్రుడిని పక్కకు తీసుకెళ్ళి మూడు వేలు యిమ్మన్నాడు. ఆ సొమ్ముతో ఉన్ని దగ్గరకు వెళ్ళి మాట్లాడి వచ్చాడు.

తర్వాత హోటలుకు వచ్చేదాకా ఉన్నిని తిడుతూనే ఉన్నాడు రాఘవరావు. "పరమ కర్కోటకుడు! వీడనేగాదండి, యీ మలయాళీలంతా యిదే వరస! యిల్లు ఖాళీ చేయకుండానే సగం అద్దె బయానా యివ్వాలిట! మనవేపు ఎక్కడా చూడలేదు గదండీ?"

తనని యింటికి రమ్మంటాడని అనుకున్నాడు రామచంద్రుడు. ఆఖరుకి అతని యింటి అడ్రస్ అడిగాడు.

"నే వచ్చి తీసుకెళ్తానుగదండి! యీ వూళ్ళో మీరెక్కడ పాట్లు పడతారూ?" అన్నాడు రాఘవరావు.

యిద్దరూ హోటల్లో స్థిమితపడ్డాక -

"అన్నట్టు - మళ్ళీ మర్చిపోతానండీ! అద్దె మూడూ యాభై! అడ్వాన్సు మూడు వేలు యిచ్చాను! మీరొచ్చే దాకా అద్దె రెండొందలు! బ్రోకరుకి మూడు వందలు! అయిదు వందలూ నా జేబులోంచి పెట్టాను! మనలో మనకి ఆ మాత్రం అవకపోతే ఎలాగండీ?"

రామచంద్రుడి మనసంతా అతని పట్ల కృతజ్ఞతతో ఆర్ద్రమయిపోయింది. అతని రెండు చేతులూ పట్టుకుని-

"మీలాంటి మంచి మిత్రుడ్ని పొందినందుకు ఎంతో ఆనందంగా ఉంది సార్! ముక్కూ మొహం తెలీని నేను ఓ ఉత్తరం ముక్క రాసినందుకు యింత సహాయం చేసారు" అన్నాడు.

మిగిలిన డబ్బు యిచ్చేసాడు రామచంద్రుడు.

"మిమ్మల్ని మా యింటికే తీసుకెళ్ళాలి. ఆవిడకి వంట్లో బాగులేదు. చాలా బాధపడుతున్నాను."

సాయంకాలంవరకూ అతనితో గడిపాడు రాఘవరావు.

మందు అలవాటు లేదన్నాడు రామచంద్రుడు. అతన్ని తీసుకోమన్నాడు. రెండు బీరకాయలతో కాలక్షేపం చేసాడు రాఘవరావు. స్టేషన్లో కలుసుకుందామని చెప్పుకుని విడిపోయారు.

మర్నాడు రామచంద్రుడు జాయినింగ్ రిపోర్టు యిచ్చాడు.

సెలవు దొరికింది. తిరుగు ప్రయాణమయాడు.

జానకీ రామచంద్రుడు అంత డబ్బు పోయాల్సి వచ్చినందుకు నడుములు విరగ్గొట్టినట్టయిపోయారు. అంత డబ్బు పోసినా అంత సాయం దొరికినందుకు ఎంతో ఆనందించారు.

"అదే తెలీని వాళ్ళయితే యింకెంత పోయాల్సి వచ్చేదోనర్రా! మనాడు మధ్య నుండి మిమ్మల్ని గట్టెక్కించాడు! తెలీని దేశం! తెలీని లోకం! ఏమయిపోదురో!" అన్నాడు రాఘవరావుని పరిచయం చేసిన మేనమామ.

"అంతే మామయ్యా!" అంది జానకి.

★ ★ ★

ప్రయాణం రోజు రానే వచ్చింది. సామాన్లు బ్రేక్‌వాన్లో ఎక్కాయి. భార్యాపిల్లల్తో రామచంద్రుడు రైలు ఎక్కాడు.

మద్రాసులో రైలు మారారు.

గంటన్నర పైగా లేటుగా నడుస్తోందని కబురు తెచ్చాడు రామచంద్రుడు.

పొరబాటున అంది జానకి - "అంత లేటయితే ఆయన వస్తారో రారో!"

"నీకు లోకం ఏం తెలుసునూ! యిలాంటి పరాయి చోట్ల ఓ భాష వాళ్ళు ఓ దేశం వాళ్ళు ఎంత కలిసికట్టుగా ఉంటారో! ఒకళ్ళకి ఒకళ్ళు ఎంత అవుతారో! అయినా - నాకు బుద్ధి లేదులే! ఆడాళ్ళతో అన్నీ చెప్పగూడదు!" తోక తొక్కిన తాచులా లేచాడు.

ఈ ధోరణిలో విరుచుకు పడిపోతున్న రామచంద్రుడిని చూసి జానకి బిత్తరపోయింది. కంపార్టుమెంట్లో ఎవరూ తెలుగువాళ్ళు ఉండర్లే- అని సర్దుకుంది. అయితే అతను అంతలా ఎందుకు కోప్పడుతున్నాడో ఆవిడకి బొత్తిగా అర్థం కాలేదు.

మరో అరగంట వరకూ మరో తెలివి తక్కువ ముక్క అనలేదు జానకి. రామచంద్రుడు శాంతించాక అంది:

"అవునండీ! నాకు తెలీకడుగుతానూ - ఆయన ఓ వేళ రాలేదనుకోండీ - మీరు ఆ యిల్లు గుర్తుపట్టగలరా?"

వెంటనే నాలిక కరుచుకుంది.

ఈమారు రామచంద్రుడు నిప్పు తొక్కిన కోతిలా ఎగిరాడు.

"అనుమానాలు ముందు పుట్టి ఆడాళ్ళు తరవాత పుట్టారుట! ఛీ! ఛీఛీ! వెనకటికెవరో శుభం పలకరా మంకెన్నా అంటే పెళ్ళికూతురు ముండ ఎక్కడ చచ్చిందని అడిగాడ్ట-"

ఆ అరుపులకి జానకి యీమారు గాభరా పడలేదు. ఈ పిచ్చి మానవునికి ఆ యిల్లు గుర్తు పట్టగలనన్న నమ్మకం లేకనే యిలా ఎగుర్తున్నాడని ఆవిడ పట్టేసింది.

"చాలించండి నిర్వాకం! మీకన్నా నేను లక్షరెట్లు నయం! యీ తిప్పలన్నీ పడే బదులు - చక్కగా మీ ఆఫీసులోనే ఎవరినో ఒకరిని నెలవు చేసుకొని యిల్లూ గట్రా చూసుకోవచ్చు గదా! కర్మ! కర్మ" అంది తనూ గొంతు పెంచి.

వెంటనే తగ్గిపోయాడు రామచంద్రుడు-

"నేనేం చేయను జానకీ! నువ్వేగదా మీ మావయ్య దగ్గరకు పంపావూ?" అన్నాడు గాభరాగా.

బయల్దేరేలోగా మూడు ఉత్తరాలు రాసాడు రాఘవరావుకి! ఒక్కదానికీ జవాబు లేదు! ఏమయినా ఒంట్లో బాగులేదో! సెలవులో ఉన్నాడో! ఎలాగయినా స్టేషనుకు వస్తాడులే - అని సరిపెట్టుకున్నాడు.

జానకి అనుమానాలన్నీ రామచంద్రుణ్ణే దొలుస్తున్నాయి. అవి జానకి

నోటంట వినేసరికి అగ్గిబరాటా అయిపోయాడు. కార్నర్ సీట్ల కోసం పిల్లలు కలియబడి పోతూంటే వాళ్ళమీద కలియబడి ఉతికేసాడు. ట్రైన్లో ప్రయాణీకులు గాభరా పడిపోయి వాళ్ళకి కార్నర్ సీట్లు యిచ్చేసారు.

కొచ్చిన్‌కి రెండున్నర గంటల లేటుగా చేరింది రైలు.

పిల్లలతో సామాన్లతో ప్లాట్‌ఫారమ్ మీద దిగాడు రామచంద్రుడు. ప్రయాణీకులంతా వెళ్ళి పోతున్నారు. కూలీలు మూగేసి మలయాళంలో అడిగేస్తున్నారు. రామచంద్రుడికి పిచ్చి ఎక్కుతున్నట్టే ఉంది.

ఉన్న ఒక్క రోజులోనూ నేర్చిన 'వేండ! వేండా!' అంటున్నాడు.

ప్లాట్‌ఫారమ్ ఖాళీ అయిపోతోంది! రామచంద్రుడి చేతివేళ్ళ గోళ్ళన్నీ ఖాళీ అయిపోయాయి.

వాడిన మొహాలతో పిల్లలు పెట్టెల మీద కూర్చున్నారు. ఆఖరు కుర్రాడు 'ఆకలి! ఆకలి' అంటూ అమ్మ కొంగు పట్టుకుని ఏడుస్తూన్నాడు. రెండు తన్నులు తిన్నా వారి ఆకలి తీరలేదు.

జానకి నోరు విప్పి తనకు తోచిన సలహా ఏదో చెప్పాలనుకుంటోంది. భర్త వాలకం చూసి ఆవిడకి ధైర్యం కలగడం లేదు.

యింతలో 'హో హ్హో హ్హో' అన్న నవ్వు! రామచంద్రుడి భుజం మీద ఎవరిదో చెయ్యి పడింది. చటుక్కున వెనక్కి తిరిగాడు.

ఉన్ని! అతని వెనక మీనాక్షి!

అతను ఏదో మాట్లాడేస్తున్నాడు. ఒక్క ముక్క కూడా అర్థం కావటం లేదు.

"రాఘవరావ్...యువర్ ఫ్రెండ్?" అంటున్నాడు ఉన్నికృష్ణన్.

"నాట్‌కమ్....." బుర్ర ఆడిస్తూ అన్నాడు రామచంద్రుడు.

కూలీలను కుదిర్చాడు ఉన్నికృష్ణన్. బ్రేక్‌వాన్లో సామాను రాలేదనీ తర్వాత బండిలో వస్తుందనీ చెప్పారు స్టేషన్లో! రామచంద్రుడు కంగారుపడ్డాడు. ఉన్నికృష్ణన్ ఏదో చెపుతున్నాడు.

అందరూ యిల్లు చేరారు.

భార్యాపిల్లలు యిద్దరూ తమ వాటాలోకి ప్రవేశించారు. స్నానాల గదిలో రెండు బాల్చీలతో నీళ్ళున్నాయి. వంటగదిలో మంచినీళ్ళున్నాయి.

మీనాక్షి పిల్లలతో మాట కలిపింది. తనతో తీసుకువెళ్ళింది. భార్యాభర్తలు స్నానాలు చేసారు.

భోజనాలకు పిలిచింది ఉన్ని భార్య.

ఆ రుచులు ఎలాగున్నా అందులో అభిమానం రుచి వాళ్ళ కడుపు నింపేసింది. ఒకరి భావం ఒకరికి అందదు.

ఆ తర్వాత నలుగురూ హాలులో కూర్చున్నారు.

"యూ మీల్స్ ఇన్ హోమ్ - మై హోమ్! -" అంటున్నాడు ఉన్ని.

పెట్టిన తిండికి డబ్బులు యిమ్మంటున్నాడు కాబోలు అనుకున్నాడు రామచంద్రుడు. డబ్బులు తీసి యివ్వబోయాడు.

"నో! నో" అంటూ ఉన్ని వారించాడు. మీనాక్షిని పిలిచి ఏదో చెప్పాడు. ఆమె గబగబా బయటకు వెళ్ళింది.

'హ హ్హా హ్హా' అంటూ నవ్వుతున్నాడు ఉన్ని ఏదో అంటూ.

రామచంద్రుడు తమ వాటాలోకి నడిచాడు. పక్క పరిచింది జానకి. అప్పటికే పిల్లలు పడుకున్నారు.

భార్యాభర్త లిద్దరూ మౌనంగా భారంగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు చతికిలబడ్డారు. యింతలో తలుపు మీద చప్పుడు!

రామచంద్రుడు వెళ్ళాడు. ఉన్నికృష్ణన్ ఓ టైపు చేసిన స్టాంపు కాగితాన్ని అతని చేతిలో ఉంచి -

"అడ్వాన్స్ - అగ్రిమెంట్" అన్నాడు.

అతను వెళ్ళాక తలుపువేసి వచ్చాడు.

కూడబలుక్కుంటూ చదివాడు రామచంద్రుడు.

"ఏంటి జానకీ యిది?" గాభరాగా అన్నాడు.

"ఏం జరిగిందండీ?"

"మూడువేలు యిస్తే రెండు వేలే అని రాసాడేంటీ ముసిలాయనా?"

"పాపం, మంచివాళ్ళులాగే ఉన్నారండి! మనం అడక్కుండానే రసీదు యిచ్చాడు! ఓవేళ మర్చిపోయాడో ఏంటో!"

"నా బొంద మర్చిపోటం! వెళ్ళి అడిగేస్తాను-"

"బావుంది తెలివి! మన గొడవ వాళ్ళకి అర్థం కాదు! వాళ్ళ గోల మనకి తెలీదు. మీ తెలివితేటలే అంతంత మాత్రం. మధ్యలో ఉన్న రాఘవరావు గారిచేతే అడిగించడం సబబు!"

"అంతేనంటావా!" అన్నాడు రామచంద్రుడు.

"యింతకీ ఆయన ఎందుకు రాలేదో!" అంది సాలోచనగా.

"ఏమయినా వంట్లో బావులేదేమో జానకీ! పరాయి దేశంలో మనవాళ్ళు మనకి అవకుండా పోరు. మనం ఆ మాత్రం అర్థం చేసుకోపోతే ఎలా?"

జానకి ఏదో అనబోయిలోగా మళ్ళీ తలుపు మీద చప్పుడు!

మీనాక్షి నిలబడి ఉంది. ఆమె వెనకాల ఓ కొత్త మొహం. దాదాపు ఉన్ని వయసే ఉంటుంది.

"నా పేరు కుట్టి. ఉన్ని మా చెల్లెలి హజ్బెండ్‌గా వుంది" అన్నాడు కుట్టి.

ఆయన మాట్లాడేది తెలుగుగా గుర్తు పట్టిన రామచంద్రుడికి అంతులేని ఆనందం కలిగింది.

ఉన్ని, కుట్టీ, రామచంద్రుడూ కూర్చున్నారు.

కుట్టీ చాలా కాలం క్రితం హైదరాబాద్‌లో కొన్నాళ్ళున్నాట్ట. తెలుగులో బాగానే మాట్లాడగలడు. ఆ తెలుగు క్రమంగా రామచంద్రుడికి అర్థమవుతోంది.

ముగ్గురూ సంభాషణలోకి దిగారు.

మొత్తం సామాను వచ్చేదాకా భోజనాలు తమ యింట్లోనే చెయ్యమన్నాడు ఉన్ని. దానికి డబ్బులు యివ్వబోయాడని చెప్పి - "మీ దేశంలో అలా డబ్బులు వసూలు చేస్తారా?" అని అడిగాడు ఉన్ని.

లేదని జవాబిచ్చి సిగ్గుపడిపోయాడు రామచంద్రుడు.

క్రమంగా సాన్నిహిత్యం పెరుగుతోందనిపించగానే అడ్వాన్సులో తేడా గురించి చెప్పేసాడు రామచంద్రుడు.

ఉన్ని గాభరాగా "చచ్చు! నాకు మూడు వేలు యివ్వలేదు. రెండు వేలే యిచ్చాడు. నా పిల్లల మీద ఒట్టు!" అన్నాడు.

అది తెలుగులో కుట్టి వివరిస్తూంటే రామచంద్రుడికి నమ్మబుద్ధి కాలేదు. అయినా నమ్మినట్టు నటించబోయాడు.

కానీ - ఉన్ని దాన్ని గమనించేసాడు.

"ఆ రాఘవరావు - అద్దె ఎక్కువ యిప్పిస్తానని నా దగ్గర కూడా రెండు వందలు తీసుకున్నాడు" అన్నాడు.

రామచంద్రుడు ఆశ్చర్యపోయాడు, మనసులో యింకా అనుమానాలున్నా - రాఘవరావు తనకి టోకరా ఇచ్చాడా అన్న అనుమానం వచ్చింది.

ఉన్ని లేచి లోపలికి వెళ్ళి డబ్బు తీసుకువచ్చి అతని ముందు ఉంచి-

"మీకు నా మాటల మీద నమ్మకం లేకపోతే యీ డబ్బు తీసుకోండి" అన్నాడు.

అతను తెలుగుభాషలో మాట్లాడకపోయినా రామచంద్రుడికి అర్థం అయిపోయింది. అతని మనసులో రకరకాల భావాలు ఒక్కమారుగా చొరబడ్డాయి.

"అయామ్ సారీ! సారీ!" అంటూ అతని చేతులు పుచ్చుకున్నాడు. డబ్బులు అతని చేతిలోనే ఉంచాడు.

రామచంద్రుడి మనసంతా భరించరాని అసహ్యం! జుగుప్స! ఉద్రేకం అపుకోలేక అన్నాడు కుట్టీతో -

"మా తెలుగు వాళ్ళంతా యింతేనండి! వొట్టి లుచ్చాలు! మాకు మేమే గోతులు తవ్వుతాం! ఛిఛీ!"

కుట్టీ నవ్వుతూంటే హేళన తొంగిచూస్తోంది.

"వాట్? వాట్?" అన్నాడు ఉన్ని.

నవ్వుతూ చెప్పాడు కుట్టి. ఉన్ని రామచంద్రుడి భుజం మీద చెయ్యి వేసాడు. కళ్ళలోకి చూసాడు. అవి మానవుడి నేత్రాలు! అవి ఏ భాషకూ అందని భావాలను అతి సులువుగా వ్యక్తపరిచే నేత్రాలు! మానవ నేత్రాలు!

అతను అన్నది ఏమిటో రామచంద్రుడికి వినపడుతోంది. ఆ అనుభూతి అందుతోంది. ఉన్ని మాటలు వింటూ ఉన్న కుట్టి నవ్వూ హేళనా ఆగిపోయాయి.

విషయాన్ని వివరించాడు కుట్టి.

"మిత్రమా! అతన్ని తెలుగువాడని తిట్టుకోకు! యిక్కడ తెలుగూ మలయాళమూ హిందీ తమిళమూ అని లేవు! ఉన్నదల్లా మనుషులు! ఉన్న భేదమల్లా మంచితనమూ - చెడ్డతనమూ అంతే!"

మన భాష, మన కులం, మన మతం, మన దేశంలాంటి భావాలనుంచి బదిలీ కావటం ప్రారంభించాడు రామచంద్రుడు.

లోపల కాసెట్‌లోంచి ముఖేష్ గొంతు వినవస్తోంది -

"బస్ వొ హీ అపరాధ్ మై హర్‌బార్

కరతా హూఁ!

ఆదమీ హూఁ!

ఆదమీ సే ప్యార్ కరతా హూఁ!"

(ఆంధ్రసచిత్రవారపత్రిక - 27/2, 5/3 - 1987)